# తోటి కోడళ్ళు

చదువుతూన్న సరస్వతి బాబు ఏడుపు విని తల తిప్పి చూచింది. తప్పటడుగులు వేసే బాబు గుమ్మం దాటలేకపోయాడు గావును గడప మీద బోర్లాపడి ఏడుస్తున్నాడు. బాబుని తియ్యటానికి సరసు లేవబోయింది, గాని ఏదో గుర్తొచ్చినట్టుగా తిరిగి కూర్చుని పుస్తకం అడ్డం పెట్టుకొని వారగా బాబుని చూడసాగింది. ఓ నిముషానికి లేచి కూర్చుని, పక్కగా పడిపోయిన బొమ్మని పొదివిపట్టుకొని రాగం తగ్గించి దిక్కులు చూస్తు నెమ్మదిగా ఏడుస్తున్నాడు బాబు. ఇంతలో వంటగదిలోంచి విసురుగా వచ్చి బాబు నెత్తుకుంటూ "ఏమే అలా బొమ్మలా కూర్చోపోతే పిల్లడు పడిపోయాడుగదా, కొంచెం తియ్యకూడదూ? పసిబిడ్డేడుస్తుంటే అలా వూరుకోటాని కెలా మనసొప్పుతుందో!" అంది కోపంగా కన్న.

"అది కాదత్తయ్యా. వాణ్ణిప్పుడు సముదాయింపబోతే అసలే రెచ్చిపోతాడని, చూసీ చూడనట్టూరుకొంటే వాడే వూరుకొంటాడని తియ్యలేదు గానీ, వాడిమీద నాకు కోపమా?" అంది సరసు సైకాలజిస్టులా.

తప్పించుకోటానికి కావలసినన్ని దార్లు. అదే నీబిడ్డయితే యివన్నీ ఆలోచించే దానివా? యిష్టంలేక ఏదో చెప్పుకొస్తావేం? వెధవ్వేషాలూ నువ్వూను" అంది కన్న బాబుని బుజం మీద వేసుకొని పచార్లు చేస్తూ.

"ఇదిగో, నీక నేకసార్లు చెప్పాను. అలా వెధవా, గిధవా అనొద్దని. చెప్పేది వినిపించుకోకుండా ఎందుకలా మాటలు మిగుల్తావ్? మిగిలిన వాళ్ళంతా వెధవలైతే, యికనువ్వేనా పునిస్త్రీగా రాజ్యమేలేది?" అంది సరసు తీక్షణంగా. కన్న కాస్త భయపడింది. "మరే నమ్మా. నేనొక్కదాన్నే సుఖంగా బ్రతకాలని చూస్తున్నాను. ఏమిటో! వెధవలవాటు అలా మాటకిముందు ఆముక్కే వచ్చేస్తుంది. వెధవది. ఐనా నాపిచ్చగాని నాపిల్లాడి గురించి నీమీద సాములెందుకులే. అసలా ఏడుపు వినపడేటప్పటికి అన్నం వారుస్తున్నాను. గానీ లేకపోతే నాపిల్లాణ్ణి నువ్వంటుకోవాలా?" అంది సమర్ధించుకొంటునట్టు.

"ఆమాత్రం బుద్ధి ముందు లేకపోయింది గావున్ను మరి. వచ్చీరాగానే వెధవా, పునిస్త్రీ అంటూ మొదలెట్టావ్. అసలు నాకిష్టమైతే ముట్టుకుంటాను లేకపోతే లేదు. దానికి నీ అధార్టీ ఏమిటి?, అసలు నీగురించి బామ్మతో చెప్పకపోతే అప్పుడడుగు. ఆఁ" అంటూ సరసు రుసరుసలాడింది.

"అబ్బో, ఎలాగో మరి! బామ్మ నాతల తీసి మొలేస్తుందేమో? అంతదాకా వస్తే నేను వదినతో చెప్పకపోతానా?" అంటూ వంటగదిలో కెళ్ళిపోయింది కన్న బాబుతో సహా.

* * *

సుమారు పన్నెండుగంటల సమయం. శాంతమ్మ, ధనమ్మ దావిట్లో పడుకొని కబుర్లాడుకొంటున్న సమయం. నిప్పులు చెరిగే ఎండలో రయ్యిమని రిక్షాలోదిగింది సరస్వతి విసురుగా. వీధిగుమ్మంలో రిక్షా

## దద్దనాల రంగనాయకమ్మ

ఆగటం చూచిన శాంతమ్మ లేచి వీధిలోకి రాబోయింది. సరసు లోపలికొచ్చింది.

"అత్తయ్య రాకుండా నువ్వొక్కదానివే వచ్చావేమే" అంది బామ్మ ధనమ్మ. సరసు మొహం చిట్లించుకొని వూరుకొంది. ఈసారి శాంతమ్మడిగింది "ఏమ్మా, అత్తయ్య రాలేదేం?" అని.

"వస్తుందట" అంది సరసు అంటీ అంటనట్టుగా.

"మళ్ళా ఏమైనా పోట్లాడుకొన్నారేవిటే?" అంది బామ్మ ధనమ్మ ఆశ్చర్యంగా.

"వూరుకోండత్తయ్యా. వాళ్ళేం చిన్నవాళ్ళా ఏమిటీ! చీటికీ మాటికీ పోట్లాడుకోటానికి" అంది శాంతమ్మ.

"కాకపోతే ఏవిటే మరి? దాని వైఖరి చూడరాదూ. దెబ్బలాడే వచ్చింది గావున్ను. అసలు నీమూలాన్నే వీళ్ళింత బరితెగిపోయారమ్మా. ఏమే, మాట్లాడవ్? ఏమైనా అనుకొన్నారా?" అంటూ బామ్మ మనమరాలి మొహంలోకి చూచింది ప్రశ్నార్థకంగా.

"అవునా?" అన్నట్టుగా చూస్తోంది శాంతమ్మకూడా కూతుర్ని.

"మీ కేదో పోట్లాటంటారుగాని, మరి అది నన్ను అస్తమానూ ప్రతీ మాటకీ వెధవా, వెధవ్వేషాలూ నువ్వూనూ, అని అంటుందేం మరి? అలా అనొద్దని చెప్పండి దానికి" అంది నేల చూపులు చూస్తూ భయంగా సరసు.

"అవ్వ దానికేం పొయ్యేకాలమే? వెధవ మాటలంటానికి, రానీ కనుక్కుంటాను" అంది బామ్మ బుగ్గలు నొక్కుకుంటూ.

"ఆవిడికి చిన్నప్పట్నుంచీ అలవాటేగాదే! ఏదో సమర్థించుకోవాలిగాని, యీ మాత్రానికే యిలా వచ్చెయ్యటం తప్పుకాదూ?" అంటూ మందలించింది శాంతమ్మ కూతుర్ని.

ఇంతలో ఝామ్మని జట్కాలో దిగింది కన్న బాబుతో.

"అదిగో. అది వస్తోందిగావున్ను" అంది బామ్మ కళ్ళుచిట్లించి వీధిగుమ్మం వేపు చూస్తూ. కన్న లోపలికొచ్చి బాబుని మంచం మీద పడుకోబెట్టి శాంతమ్మదగ్గరకొచ్చి కూర్చుంది. సరసు మొహం తిప్పుకొంది.

"ఏమే, సరసుతో కల్సి రాలేదేం?" అంది బామ్మ కూపీతీస్తున్నట్టు.

"మీ కావిడ చెప్పలేదూ?" అంది కన్న.

"దానికేంగాని ఇద్దరూ పెద్దవాళ్ళయ్యారు గదా. ఇంకా ఒకళ్ళనొకళ్ళు అనుకోటం ఏం బావుంటుంది కన్నా? నీ అలవాటు కొంచెం తగ్గించుకోవాలి మరి" అంది సమర్థిస్తున్నట్టుగా శాంతమ్మ.

"కొంచెమేమిటే? అంతా తగ్గించుకోవాలి" అంది బామ్మ కోపంగా.

"కాదొదినా, నే నేదో నోరుజారి అన్నానే అనుకో, దానికే పరిగెత్తుకు రావాలా? అసలది ఏంచేసిందో చెప్పలేదన్న మాట. పిల్లవాడు గడపమీద బోర్లాపడిపోయి ఏడుస్తుంటే వాణ్ణి ముట్టుకోన్నా ముట్టుకోలేదే. ఆ కోపంలో అనేశాను" అంది కన్న ఖరాగా.




# ★ తోటికోడళ్లు ★

౩

"కాదమ్మా. నేనసలు వాణ్ణేందుకు తియ్యలేదంటే..."

"ఆఁ. చాల్లే ఊరుకోండురూ, నేర్చారు. అయినదానికీ, కానిదానికీ తగూపెట్టుకొని, ఊళ్ళో పుట్టిల్లుందిగదా అని చిల్లరామల్లరా రిక్షాలకీ జట్కాలకీ పోసి ఘడిఘడికీ రావటం నేర్చారు. నామూలాన్నే మీరు చెడిపోతున్నారని మీ అన్నయ్య అంటున్నారు కన్నా! ఇవ్వాళ ఊళ్ళోలేరుగాని వుంటే మిమ్మల్నిద్దర్నీ కేకలేసేవారే తెలుసా?" అంది కాంతమ్మ. కన్న ఏదో చెప్దామనుకొంది గాని, భయపడి వూరుకొంది. సరసు కూడా తలత్రిప్పి కూర్చుంది. బామ్మ అందుకొంది.

"లోకంలో అందరికీ పిల్లలున్నారు, అంతా కాపురాలు చేసుకొంటున్నారు గాని, మీకులా కొట్లాడుకొనే తోటికోడళ్ళెక్కడా వుండరర్రా. మరీ మీరిపోతున్నారు. ఎవరేనా వింటే—అవ్వ—ఏమనుకొంటారు? పోట్లాటలాళ్ళమ్మా, పోర్గీల వాళ్ళమ్మా అని అనుకోరు? మీకు బుద్ధిలేకపోతే మాకులేదా? అంటారు. నేను నలుగురు తోటికోడళ్ళతోను, ముగ్గురాడబిడ్డలతోను కాపరం చేశానుగాని మీలా వెలాగబెట్టామా? మీకు అత్తా లేదు ఆడబిడ్డాలేదు. మీలో మీకు పడక అఘోరిస్తున్నారు. అసలానాడే చెప్పా. వినిపించుకొన్నారా నామాటకి? వీళ్లిద్దర్నీ వేరే వేరే యిద్దామని చెవినిల్లుగట్టుకొని పోరా. వింటేగా వాడు. పాపం అభమూ శుభమూ ఎరుగని ఆ అన్నదమ్ములికి చెల్లెల్నీ కూతుర్నీ కట్టబెట్టాడు. వాళ్ళనేం వేపించుకు తింటున్నారో వీళ్లిద్దరూ కలసి?"

"అబ్బ వూరుకోండూ" అంది సరసు బామ్మ దగ్గర చనువుకొద్దీ. బామ్మ కస్సుమంది "ఏం వూరుకోవాలే? ఇన్నాళ్లూ యిలా, వూరుకోబట్టేగా మితిమీరారు.? మళ్లా ఎదిరింపు కూడానా? కిందా మీదా పడుతూ అక్కడే పడివుండక యిక్కడికెగేసుకొస్తారెందుకూ?

వూళ్ళో వున్నందుకు బాగానే వుంది మీ వరస. హాయిగా యిద్దరూ చిన్న పనీ పెద్ద పనీ చేసుకొని కళకళ్ళాడుతూ వుంటే దానికీ కీచులాట లెందుకే?" అంటూ అర్ధగంటసేపు గదమాయించింది బామ్మ. కన్నగాని సరసుగానీ ఏమీ చెప్పలేకపోయారు. వాళ్లిద్దరూ ఏడాది క్రిందటివరకూ మేనత్తా మేనగోడళ్లు. ఇప్పుడు తోటికోడళ్లుకూడాను. అతి చిన్న విషయంమీద తగూ పెట్టుకోటం, దాన్ని పెద్దదిగా చేసుకొని, మాటా మాటా అనుకొని పుట్టింటికి బయల్దేరటం, తప్పున్నవాళ్లు చివాట్లుతిని, సాయంత్రానికి యింటికి రావటం పరిపాటైపోయింది. కాని ఈసారి తగూలో ఎవరిది తప్పు? అని బామ్మగాని వదినగాని ఆలోచించకుండానే యిద్దర్నీ కేకలేశారు. వదిన తన పక్షమనుకొనే కన్న నిరుత్సాహపడింది. అకస్మాత్తుగా బామ్మ మారిపోయేసరికి, తన అభిప్రాయం మార్చేసుకొంది సరసు.

"వెళ్తాను వొదినా" అంటూ లేచింది కన్న.

"కాస్సేపుండండమ్మా. కాఫీలు తీసుకొని వెళ్దురుగానీ" అంది కాంతమ్మ.

"వాళ్లింటికి వాళ్ళని పోనీ. వెళ్ళి తాగుతార్లే" అంది బామ్మ.

"అయ్యో వుండండత్తయ్యా. ఏదో చిన్నతనం. వాళ్ళకే తెలుస్తుంది వివరం. తప్పమ్మా అలా పోట్లాడుకో కూడదు. జాగ్రత్తగా వెళ్లండి మరి" అంది కాంతమ్మ.

కన్న వీధిలో కెళ్ళి దారినపోయే రిక్షాని పిలిచింది. లోపలికొచ్చి బాబుని భుజాన్నేసుకొని "వెళ్తా మొదినా. వెళ్తున్నానే అమ్మా" అని చెప్పి రిక్షాలో కూర్చుంది.

"ఆ వెళ్లండి. వెళ్ళండి. మళ్లా మాగడప తొక్కకండి మేం తీసుకొచ్చేదాకా" అంది బామ్మ వీధిగుమ్మంలోకొస్తూ.

"ఎక్కు సరసూ వెళ్ళి" అంది కాంతమ్మ కూతురితో. చేసేదిలేక సరసు చాలా ఇబ్బందిగా వెళ్లి ఓ మూలగా ఒదిగి కూర్చుంది రిక్షాలో. రిక్షా కదిలిపోయింది.

* * *

"వచ్చేస్తున్నా నత్తయ్యా. వడ్డించెయ్" అంది సరసు తల దువ్వుకొంటూ వంటగదిలోకి వినపడేలా. మొగవాళ్లిద్దరూ భోంచేసి వెళ్లిపోయాక కూర్చున్నారిద్దరూ.

"అబ్బా. ఉప్పెక్కువైపోయిందే" అంది సరసు.

"మరి మన మగవాళ్లకి తక్కువేస్తే పనికిరాదని కొంచెం తగలనిస్తున్నానే. అంతెక్కువయ్యిందా?"

"నీకనేకసార్లు చెప్పాను. కొంచెం తగ్గించకూడదూ? నావంటనాడు వుప్పుతక్కువైందంటున్నారా వాళ్ళు? నీయిష్టంవచ్చినట్టే వండుకో. ఈ కూడు తినకపోతేనేం?" అంటూ రుసరుసలాడుతూ చెయ్యి కడిగేసుకొని, కంచం తీసేసింది సరసు. కన్న తెల్లబోయి తేరుకునేసరికి అంతా ఐపోయింది. "ఏమిటో దీనికింతవిసురు?" అనుకొంది. పుట్టింటి వాళ్ళు పెట్టినచివాట్లు యింకా జీర్ణమైపోలేదేమో. అందుకే తగూ పెరగలేదు. అతి చిన్నవిషయాలమీద అభిప్రాయాలు పడటం, మళ్ళా ఏడెనిమిది రోజులకి కల్సిపోవటం—

* * *

"అత్తయ్యా, బాబుకి వాచీ ఎలా అందింది? నువ్వుగాని యిచ్చావా?" అంది సరసు వాచీని పరీక్షిస్తూ ఆత్రుతగా.

"ఏం? ఏమైంది? పరుపుమీద కూర్చున్నాడుగదా అని దెబ్బ తగలదులే అని యిచ్చానే," అంటూ దగ్గరగా వచ్చింది కన్న.

"అఘోరించవల్సింది. పరుపుమీదనుంచి క్రిందకి విసిరేశాడు గావును అద్దం బద్దలైంది. బాగా పనిచెయ్యటంలేదని డ్రాయర్ మీద పడేసి వెళ్ళిపోయారు. నన్నేం తిడతారో! చిన్న వెధవకి ఆడుకోటానికివ్వటానికి వాచీయే దొరికిందా?"

"దెబ్బ తగలదులే అనుకొన్నానే. విసిరేస్తాడనుకొన్నానా?"

"అనుకోవు. నీకేం నువు బాగానే వుంటావు. నా కొస్తాయ్ చివాట్లు"

"నీదంతా చోద్యం. పసివెధవ చేసినదానికి ఎవ్వరైతే మట్టుకు ఎందుకు తిడతారు? తిడతారు, తిడతారనకపోతే నీకంత తిట్టాలని వుంటే నువ్వే తిట్టరాదు? ఏదో తెలీక ఏడ్చాన్లే వెధవపని"

"ఛీ. నీగుణం నువ్వుపోనిచ్చుకోవు, చేసేవన్నీ యిల్లాంటి పనులూ. పైగానిష్ఠూరాలు," చివాల్న వెళ్ళిపోయింది సరసు.

* * *

"హారి శ్రీరామచంద్రా! పిల్లల్ని కంటాం గాని రాతల్ని కంటామా? మా యింటావంటా యింటివెనకాల వున్నవాళ్లకి కూడా లేవీ జగడాలు. తులసమ్మ కడుపున దురదకొండ పుడుతుందట. పిదపకాలం, పిదప బుద్ధులూ అవ్వ అవ్వ" అంటూ బామ్మ తనకి చెరొకవేపునా కూర్చొన్న తోటికోడళ్ళని చూచి ఏకధాటిగా అరగంటసేపు ఆశ్చర్యపడిపోయేసింది. ఇంతలో బామ్మ కొడుకు, కన్న అన్న, సరసునాన్న ఐన విశ్వనాథంగారు వీధిలోంచి వస్తూనే "ఏమమ్మా. ఎప్పుడొచ్చారేమిటి?" అని ప్రశ్నించారు తోటి కోడళ్ళని. తను చెప్తుందంటే తను చెప్తుందని తోటికోడళ్ళిద్దరూ వూరుకొన్నారు.

"వాళ్ళెక్కడ చెప్తార్రా. నీ పిచ్చిగాని. మళ్ళా కీచులాడుకొన్నారట. దిగుమతీ అయ్యారు. ఇక వూరుకొంటే లాభంలేదు. అవ్వ-ఎవరైనా వింటే ఎంత అప్రతిష్ఠ. వీరి తగూలకేదో పరిష్కారం చెయ్యి." అని పరిచయం చేసింది పరిస్థితిని బామ్మ. విశ్వనాథంగారు పడకుర్చీలో కూర్చొని—

"ఏమ్మా కన్నా-మీ కసలుపోట్లాటలెందుకొస్తున్నట్టు?" అన్నారు ముందుకు వంగి చెల్లెల్ని చూస్తూ.

"మీమసలు పోట్లాడుకోటం లేదే" అంది కన్న విచిత్రంగా.

"ఆఁఆఁ హమ్మా. ఎంతకైనా తగుదువే. అసలు పోట్లాడుకోటంలా. ఆట్లాడుకొంటున్నా రామ్మా" అంది బామ్మ కోపంగా.

ఈసారి విశ్వనాధంగారు పోజు మార్చి, పద్ధతి మార్చి, అడిగారు కూతుర్ని "ఏం సరసూ! నువ్వూ అత్తా యెంతో స్నేహంగా వుంటంలా?" అని. సరసు చిన్నబోయింది.

"కాదు నాన్నా. వాచీ పోయినందుకు కొప్పడ్డానని తనే వచ్చేసింది ముందు" అంది.

"అది వచ్చేస్తే. పోనీ నువ్వుండి పోక పోయావా? ఒరేయ్ ఇద్దర్లోనూ వుందిరా కొంటెతనం. ఇప్పుడిలాగే వుంటారుగాని రేపట్నుంచీ మళ్లా మొదలెడతారు! అసలిలాంటి వేషాలు సాగనివ్వకుండా చూడాలి" అంది బామ్మ కసిగా.

"నలుగుర్లోనూ పేరుపడిపోవటానికొక్కానీ, వీళ్ళకేం గుణమో? అత్త, ఆడబిడ్డల సాయం ఎలాగూ లేదు. వీళ్ళిద్దరూ కల్సి వుంటారనుకొంటే యిలా తయారయ్యారు. ఏం చేస్తాం? ఖర్మ. రోజూ యిలా పోరులాడటం మాత్రం బావుండేమిల్లేండి. నూరేళ్లున్నా చావు తప్పదు. వెయ్యేళ్లున్నా వేరు తప్పదు. ఏదో పరిష్కారం చేస్తేనే మంచిదేమో" అంది అప్పటివరకూ మౌనంగా కూర్చొన్న కాంతమ్మ.

"హుం - ఆడగుణం పోనిచ్చుకొన్నారు గాదే. సరే. ఈడు వచ్చిన వాళ్ళకి కూడా ఎంతకని చెప్తాం? వాళ్ళకి తెలిసివుండాలి గాని ఒకవేపున చెల్లెలు. ఒకవేపున కూతురు. వీళ్లతగూలు తీర్చకంటే వేరే వుంచెయ్యటమే మంచిది. అయితే ఆ అన్నదమ్ముల్ని కనుక్కొని చూస్తాను. పండంటి సంసారాన్ని విడదియ్యటమంటే వీళ్ళకి చీమకుట్టినట్టుగాకూడా లేదన్నమాట" అంటూ విశ్వనాధంగారు విసురుగా కుర్చీలోంచి లేచి పచార్లు చెయ్యసాగారు.

"ఆడవాళ్లంతా కలిసివుంటే ఎంత అండ ఎంత సాయం రేపట్నుంచీ తెలిసొస్తుంది. కష్టమొచ్చినా ఒంటిపిట్ట రాకాసుల్లా చస్తారు. కాస్త ఒంట్లో బాగా లేకపోయినా తప్పదుగదా, అదే కలిసీ మెలిసీ వుంటే! ఆఖరికి తలంటుకోవాలంటే కుంకుడుకాయ రసం పోసేవాళ్లుండరుగదా. అయ్యోరామ. ఒకరి పొడ ఒకరికి పడదుగా" అంటూ గొణుక్కొంది స్వగతంగా-పరగతంగా బామ్మ.

"అదే, అదే, తెలిసొస్తుంది. అనుభవాన్ని మించిన మందు లేదు." అన్నారు విశ్వనాధంగారు కోపంగా. తోటికోడళ్లు తెల్లబోయారు. "సరసూని అడుగుతాను కలిసేవుందామని" అని అత్తయ్య అనుకొన్నప్పుడే "అత్తయ్యనడగాలి" అనుకొంది సరస్వతి. ★

